క్లుప్తంగా

ఆస్తిపన్ను బకాయి వడ్డీపై 90 శాతం రాయితీ

తుక్కుగూడ: 2022–23 సంవత్సరానికి గాను ఆస్తిపన్ను బకాయి వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం 10 శాతం వడ్డీ పేరుకపోయిన బకాయిలను చెల్లించే అవకాశం ఉందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని ఈ నెల 31వ తేదీలోపు వినియోగించుకోవాలన్నారు.

స్పెషల్ డ్రైవ్ గడువు పెంచాలి



బొక్క జంగారెడ్డి, జెడ్పీటీసీ, కందుకూరు

కందుకూరు: ధరణి సమస్యలపై ప్రభుత్వం ప్రకటించిన స్పెషల్ డ్రైవ్ గడువును పెంచాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒక్క కందుకూరు మండలంలోనే నాలుగు వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవన్నీ కేవలం ఈ నెల 9వ తేదీ వరకు ఎలా పరిష్కరిస్తారని పేర్కొన్నారు. మధ్యలో మూడురోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నాయని, స్పెషల్ డ్రైవ్‌ను మరికొన్ని రోజులు పొడిగించాలని తెలిపారు. అన్ని దరఖాస్తులు సానుకూలంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారాలు నమ్మొద్దు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీని తాను వదిలి వెళ్లే ప్రసక్తే లేదని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ క్యాడర్‌ను తప్పుదోవలో పడేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తాను పని చేస్తానని తెలిపారు. ఓడిపోతామనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు తనపై తప్పుడు ప్రచారం చేస్తూ కుట్రలకు తెరలేపుతున్నారన్నారు. తాను పార్టీ మారుతున్నానని సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నమ్మొద్దని సూచించారు. చేవేళ్లలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో తనకు మంచి ప్రాధాన్యతనిస్తుందనే నమ్మకం బలంగా ఉందన్నారు. తప్పుడు ప్రచారాన్ని ఎవరు నమ్మొద్దని ఆయన కోరారు.

సన్మానం



జల్‌పల్లి కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సూరెడ్డి కృష్ణారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అల్లూరి వాణిరెడ్డికి మాజీ సర్పంచ్, మున్సిపాలిటీ కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నూతన సీఐగా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ సైదిరెడ్డి బదిలీపై వెళ్లడంతో రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేసే సత్యనారాయణను ఇక్కడ కేటాయించారు. శాంతి భద్రతలను పరిరక్షణకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

కడ్తాల్: పాడిరైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ముద్విన్, చల్లంపల్లి వెలుగురాళ్ల తండా, మద్దెలకుంట తండాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పశువులకు డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జేవీఓ, వైద్య సిబ్బంది ఉన్నారు.

శాశ్వత కలసాకారం

- నకల హంగులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ప్రైవేట్‌కు దీటుగా తరగతి గదులు
- ఇకపై పూర్తి సమయం క్లాసుల నిర్వహణ



ఆధునిక హంగులతో డిజిటల్ తరగతి గది



మీర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం

మీర్‌పేట: సకల హంగులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం సిద్ధమైంది. మీర్‌పేటతో పాటు పరిసర ప్రాంత విద్యార్థుల కోసం గత ప్రభుత్వం స్థానికంగా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ పాఠశాలలోనే కాలేజీని ప్రారంభించింది. రెండేళ్ల పాటు ఉదయం పాఠశాల తరగతులు, మధ్యాహ్నం జూనియర్ కళాశాల తరగతులు కొనసాగాయి. జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం కోసం గత సంవత్సరం రూ.2.35 కోట్ల నిధులను మంజూరు చేయడంతో సొంత భవన కల సాకారమైంది.

ఆధునిక హంగులతో..

ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనే రెండు అంతస్తులతో మొత్తం 10 గదులతో భవనాన్ని నిర్మించారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా తరగతి గదుల్లో ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, గ్రీన్‌బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు కళాశాలకు ప్రత్యేకంగా టాయిలెట్లను నిర్మించారు. అత్యాధునిక వసతులతో కళాశాల భవనాన్ని నిర్మించడంపై అధ్యాపకులు, విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక నుంచి పూర్తి సమయం తరగతులు

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకే పాఠశాల తరగతులు ఉండడం, ఆ తరువాత కళాశాల తరగతులు కొనసాగుతుండడంతో విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదని తల్లిదండ్రులు, స్థానికులు గతంలో పలుమార్లు ఆరోపించారు. ప్రస్తుతం కళాశాల భవనం అందుబాటులోకి రావడంతో ఇక పాఠశాల తరగతులు పూర్తి సమయం కొనసాగించడానికి ఇబ్బందులు ఉండవని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

చేరికలు మరింత పెరుగుతాయి..



కళాశాల ప్రారంభం నుంచే మధ్యాహ్నం నుంచి తరగతులు ఉన్నా మీర్‌పేటతో పాటు బడంగ్‌పేట, బాలాపూర్, నాదర్‌గుల్, బీఎన్‌రెడ్డినగర్, ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో చేరారు. ప్రస్తుతం మొదటి, ద్వితీయ సంవత్సరంలో కలిపి మొత్తం 350 మంది విద్యార్థులు ఉన్నారు. అత్యాధునిక హంగులతో భవనం అందుబాటులోకి రావడంతో వచ్చే విద్యా సంవత్సరంలో చేరికలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

– జి.సైదులు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మీర్‌పేట

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



కందుకూరులో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

కందుకూరు: ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని డీఎల్‌పీఓ సాధన ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో ఎంపీడీఓ సరితతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి నెలాఖరులోగా తప్పనిసరి పన్నులు వంద శాతం వసూలు చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులు, వన నర్సరీల పనుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ సునీల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల కమిటీల ఎన్నిక



మండల కమిటీలతో ఆ సంఘం నాయకులు

కందుకూరు: సేవాలాల్ సేన మండల కమిటీని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, ఉపాధ్యక్షుడు భీంలాల్‌పవార్ ఆధ్వర్యంలో శుక్రవారం సేవాలాల్ సేన నాయకులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల సేవాలాల్ సేన కమిటీ అధ్యక్షుడిగా జర్పుల రవినాయక్, గౌరవాధ్యక్షుడిగా బాణావత్ బాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా కుర్ర రమేశ్‌నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామావత్ రవినాయక్, ప్రచార కార్యదర్శిగా ముడావత్ గోవర్ధన్ నాయక్, కోశాధికారిగా సభావత్ కృష్ణనాయక్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌నాయక్, లోకేశ్‌నాయక్, మోతీలాల్‌నాయక్, కొర్ర రాజునాయక్, రామావత్ శంకర్‌నాయక్, కార్యదర్శులుగా వి.వినోద్‌నాయక్, బానోత్ సామ్యనాయక్, రాంచంద్రనాయక్, జగన్‌నాయక్, శ్రీనునాయక్‌లను ఎన్నుకున్నామన్నారు. రైతు సేన మండల కమిటీ అధ్యక్షుడిగా రామావత్ హట్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా నేనావత్ సీతనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జరుకుల రూప్లానాయక్, ఉపాధ్యక్షుడిగా పి.బంచీలాల్‌నాయక్, కార్యదర్శిగా వి.లచ్చునాయక్ లను ఎన్నుకున్నామన్నారు. యువసేన కమిటీ అధ్యక్షుడిగా దేవేందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రామావత్ శ్రీకాంత్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రామావత్ అమరేందర్‌నాయక్, జైపాల్‌నాయక్, మేరావత్ కృష్ణనాయక్, గణేశ్‌నాయక్, వి.వెంకటేశ్‌నాయక్, కార్యదర్శులుగా పి.హరినాయక్, దేవ్‌సింగ్‌నాయక్, సురేశ్ నాయక్‌లను ఎన్నుకున్నామని తెలిపారు.

పెద్దబావి పార్వతమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న కేఎల్ఆర్, టీకేఆర్, మేయర్ తదితరులు

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, సమరసింహారెడ్డి, వెంకట్‌రెడ్డిల మాతృమూర్తి పెద్దబావి పార్వతమ్మ దశదినకర్మను కుటుంబ సభ్యులు బాధాతప్త హృదయాలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. ప్రసిద్ధిగాంచిన బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం గణేశ్ లడ్డూను ఎనిమిది సార్లు కైవసం చేసుకున్న ఘనత ఆమెకే దక్కిందని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, మేయర్ చిగురింత పారిజాత, బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, పలువురు కార్పొరేటర్లు హాజరయ్యారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న తండావాసులు, భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని నాగుల్‌దోన తండాల్లో ఆంజనేయస్వామి ధ్వజస్తంభ శిఖర విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, తమలపాకుల అర్చన, పుష్పలంకరణతో పాటు పలు పూజలు భక్తిశ్రద్ధలతో తండావాసులు నిర్వహించారు. ఆలయం వద్ద తండావాసులు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.రాజునాయక్, ఆలయ, తండాపెద్దలు అంగోత్ గోపాల్‌నాయక్, ఆనంద్ నాయక్, జంప్లానాయక్, గాంసీరామ్‌నాయక్, గోవిందునాయక్, సురేందర్ నాయక్, హేమ్లానాయక్, హన్మంతునాయక్, ప్రభునాయక్, దేవ్‌సింగ్ నాయక్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ పలు పూజలు భక్తులు నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పిల్లల భవిష్యత్‌పై బాధ్యత తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వల కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో పాటు ఎంఈఓ, నిర్వాహకులు

కందుకూరు: పిల్లల భవిష్యత్‌పై పూర్తి బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు తీసుకొని సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని నోబుల్ హైస్కూల్ 29వ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు బైరు కొండల్ రెడ్డి, బైరు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, డ్యాన్సులు, సందేశాత్మక నాటికల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లలు చిన్న చిన్న కారణాలతో అఘాయిత్యాలు చేసుకుంటున్నారని, వారిని మానసికంగా దృఢంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే వారి భవిష్యత్‌కు బాటలు వేసినవారవుతారన్నారు. లక్ష్యాన్ని పెట్టుకొని పట్టుదలతో ఇష్టంగా చదివేలా వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఇన్‌చార్జి ఎంఈఓ మనోహర్, హైకోర్టు సీనియర్ లాయర్ వెంకటాచారి మాట్లాడుతూ.. ర్యాంకులే ప్రమాణికం కాదని, పిల్లల ప్రవర్తన కూడా ముఖ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఈటీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

హుడాకాంప్లెక్స్: వ్యాయామ ఉపాధ్యాయులకు సంబంధించి కేవలం 182 పోస్టులను మాత్రమే చూపడం నిరుద్యోగులను నిరాశ పరిచిందని ఫిజికల్ ఆర్మీ అకాడమీ చైర్మన్ నందునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 1,512 పోస్టులను ఈ మెగా డీఎస్సీలోనే నోటిఫికేషన్ జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 192 ఆదర్శ పాఠశాలల్లో ఒక్క ప్రభుత్వ పీఈటీలు లేరన్నారు. 15,322 ప్రైమరీ పాఠశాలల్లో 3,145 అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో ఒక్క పోస్టు నియామకం జరగలేదన్నారు. జూనియర్ కళాశాలల్లో ఉన్న 303 జూనియర్ లెక్చరర్ పీడీ ఖాళీలను, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 110 వ్యాయామ ఉపాధ్యాయ అసిస్టెంట్ ప్రొఫెసర్లను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీఈటీ ట్రైనింగ్ చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పౌర సరఫరాల కమిషనర్‌కు రేషన్ డీలర్ల వినతి



పౌర సరఫరాల కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీలర్లు

మహేశ్వరం: పౌర సరఫరాల కమిషనర్ డీఎస్. చౌహాన్‌ను కలిసిన రేషన్ డీలర్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న డీలర్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. త్వరలో రాష్ట్రంలో వివిధ జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుంటానని ఆయన పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రంగారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణ, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మండ్లు, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాను, రేషన్ డీలర్లు చంద్రశేఖర్‌రెడ్డి, సందీప్, విజయ్, రఫీక్, ప్రవీణ్ పలువురు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులను సత్వరం పూర్తి చేయండి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారును ఆదేశించారు. శుక్రవారం ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా నియోజకవర్గంలో జరుగుతున్న ఫ్లైఓవర్‌ను తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బైరామల్‌గూడలో లూప్ ఆకారంలో నిర్మించిన స్కైఫ్లైఓవర్ పనులు దాదాపు పూర్తయ్యాయని అన్నారు. ఎల్‌బీనగర్ నుంచి చంపాపేట వరకు వెళ్లే ఫ్లైఓవర్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆయన అధికారులకు తెలిపారు. ఈ పనులను సకాంలో పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలో పార్లమెంటు ఎన్నికల కోడ్ వస్తే పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పనులను వేగవంతం చేయాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఎస్ఈ రవీంద్‌రెడ్డి, ఈఈ రోహిణి, డీఈ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా గుంతలమయం

- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- రాకపోకలకు జనం అవస్థలు
- ఇదీ గడ్డిఅన్నారం డివిజన్‌లో పరిస్థితి

కంకర తేలి అధ్వానంగా కాలనీల రోడ్లు



మధురాపురి కాలనీలో గుంతలుపడ్డ రహదారి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఎక్కడ చూసినా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కంకర తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు కాలనీ రోడ్ల మరమ్మతుపై దృష్టి పెట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

◆ గడ్డిఅన్నారం డివిజన్‌లోని మధురాపురి, గౌతంనగర్, లలితానగర్ తదితర కాలనీల్లో సీసీ రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

◆ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనుల కోసం రోడ్లను తవ్వుతున్న కాంట్రాక్టర్లు, అధికారులు పనులు పూర్తయిన వెంటనే రోడ్డు ప్యాచ్ వర్క్‌లు చేయకుండా అలాగే వదిలేస్తున్నారని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

◆ కంకర తేలి, గుంతలు పడ్డ కాలనీ రోడ్లపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు.

◆ ముక్కు పిండి పన్నులు వసూలు చేసే అధికారులు ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించటంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ కార్పొరేటర్, అధికారులు వెంటనే స్పందించి అధ్వానంగా మారిన కాలనీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రతీ ఆదివారం ఆస్తి పన్ను పరిష్కార వేదిక

- మూడు సర్కిళ్ల కార్యాలయాల్లో ఏర్పాటు
- ఉదయం 9.30 నుంచి మ.1 గంట వరకు నిర్వహణ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌లోని జీహెచ్ఎంసీ మూడు సర్కిళ్ల కార్యాలయాల్లో ఈ నెల 3,10, 17, 24, 31 (ప్రతి ఆదివారం) తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఆస్తి పన్ను పరిష్కార వేదిక నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఆస్తి పన్నుకు సంబంధించి ఇంటి యజమానులకు ఏమైనా సందేహాలు ఉంటే ఈ ఆస్తి పన్ను పరిష్కార వేదిక ద్వారా పరిష్కరించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తమకు ఆస్తి పన్ను ఎక్కువగా వస్తోందని తగ్గించాలని కొందరు, పెనాల్టీలు అధికంగా విధించారని మరికొందరు ఫిర్యాదు చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులన్నింటినీ అధికారులు సత్వరం పరిష్కరించేందుకు ఈ పరిష్కార వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతీ ఆదివారం నిర్వహించే ఆస్తి పన్ను పరిష్కార వేదికలో ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు బిల్ కలెక్టర్లు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు.